
సాక్షి
జోగులాంబ గద్వాల
ఆదివారం । 21 । ఏప్రిల్ । 2024



నేటినుంచి బ్రహ్మోత్సవాలు

మద్దిమడుగు అంజన్న బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి.

వివరాలు 8లో ▸



భారీగా నగదు పట్టివేత

ఉమ్మడి జిల్లాలో నిర్వహిస్తున్న తనిఖీల్లో భారీ స్థాయిలో నగదు పట్టుబడింది.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
38.8 /24.8

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉన్నా ఉక్కపోత ఉంటుంది. మధ్యాహ్నం నుంచి ఎండ తీవ్రత పెరుగుతుంది.

సామాజిక వర్గాలపై నజర్

నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌పై ప్రధాన పార్టీల దృష్టి

- నియోజకవర్గంలో రసవత్తరంగా త్రిముఖ పోరు
- క్షేత్రస్థాయిలో ప్రచారం ప్రారంభించిన ప్రధాన పార్టీలు
- గెలుపే లక్ష్యంగా వ్యూహ, ప్రతివ్యూహాలు



సాక్షి, నాగర్‌కర్నూల్:

లోక్‌సభ ఎన్నికల ప్రచారంపై ప్రధాన పార్టీలు దృష్టిపెట్టాయి. ఉగాది, రంజాన్ పండగలు పూర్తి కావడం, ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో పార్టీలు తమ ఎన్నికల ప్రచార జోరును పెంచాయి. ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానమైన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని పార్టీలు కీలకంగా తీసుకున్నాయి. ఈ స్థానంలో గెలుపే లక్ష్యంగా తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఇందుకోసం సామాజిక వర్గాల వారీగా ఓట్లను గంపగుత్తగా పొందేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నాయి. ఎన్నికలకు గడువు సమీపిస్తున్న కొద్దీ తమ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయి ప్రచారాన్ని హోరెత్తించనున్నాయి.

గెలుపే లక్ష్యంగా పావులు..

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో గెలుపు సాధించేందుకు అభ్యర్థుల ఎంపిక నుంచే పార్టీలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. బీఆర్‌ఎస్ ఎంపీ రాములును పార్టీలో చేర్చుకోవడంతోపాటు ఆయన తనయుడు భరత్‌ప్రసాద్‌ను బీజేపీ తమ అభ్యర్థిగా ఎంచుకుంది. కాంగ్రెస్ నుంచి సీనియర్ నేత మల్లురవిని ఎన్నికల బరిలో దింపింది. మరోవైపు బీఆర్‌ఎస్ సైతం గెలుపే లక్ష్యంగా వేగంగా పావులు కదుపుతోంది. ఇందులో భాగంగానే బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను పార్టీలో చేర్చుకుని, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిపింది. ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానంలో మూడు పార్టీలు బలమైన నేతలను పోటీలో ఉంచుతుండటంతో రానున్న లోక్‌సభ ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది.

క్షేత్రస్థాయి ప్రచారంలో కాంగ్రెస్..

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ దూకుడు ప్రదర్శిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో సత్తాచాటి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రానున్న ఎన్నికల్లోనూ పట్టు సాధించాలన్న తలంపుతో ఉంది. ఇప్పటికే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గకేంద్రంలో ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించింది. కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి ఇప్పటికే క్షేత్రస్థాయి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇటీవల అచ్చంపేట నియోజకవర్గంలోని పదర, అమ్రాబాద్, ఉప్పునుంతల మండల కేంద్రాల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఇ తర పార్టీల్లో ఉన్న నేతలను కాంగ్రెస్ లో చేర్చుకునేందు కు ఆపరేషన్ ఆకర్ష్ మంత్రాన్ని అమలు చేస్తోంది.

ప్రజలతో మమేకం..

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను బరిలోకి దింపిన బీఆర్‌ఎస్ ఈ స్థానంలో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతోంది. ఇటీవల జిల్లాకేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించింది. నియోజకవర్గ కేంద్రాలతో పాటు మండలాల్లోనూ మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులతో కలిసి సమావేశాల నిర్వహణకు సిద్ధమవుతోంది. పార్టీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు. పట్టణ కేంద్రాల్లో మార్నింగ్ వాక్‌లో భాగంగా ప్రజలతో మమేకం అయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రధానంగా ఎస్సీ సామాజిక వర్గ ఓట్లను గంపగుత్తగా పొందటంతో పాటు ప్రభావం ఉన్న ఇతర సామాజికవర్గాల మద్దతు పొందేందుకు బీఆర్‌ఎస్ ప్రయత్నాలు సాగిస్తోంది.

సామాజికవర్గాలే టార్గెట్..

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 17 లక్షల వరకు ఓటర్లు ఉండగా.. వీరిలో ఎస్సీ వర్గాలకు చెందిన ఓట్ల ప్రాబల్యం ఎక్కువగా కనిపిస్తోంది. మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో వీరి సంఖ్య సుమారు 5 లక్షలకుపైగా ఉన్నట్టు తెలుస్తోంది. బీఆర్‌ఎస్, బీజేపీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారిని అభ్యర్థులుగా ప్రకటించగా.. కాంగ్రెస్ మాల సామాజిక వర్గానికి చెందిన వారిని అభ్యర్థిగా ప్రకటించింది. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రధాన సామాజిక వర్గాల ఓట్లను గంపగుత్తగా పొందేందుకు పార్టీలు ప్రయత్నాలు సాగిస్తున్నాయి. ఇప్పటికే ఆయా పార్టీల అభ్యర్థులు నియోజకవర్గాలు, మండల స్థాయిలో నేతలతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు.

గ్రామాల్లోకి బీజేపీ..

బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న రాములును పార్టీలో చేర్చుకుని ఆయన కుమారుడు భరత్‌ప్రసాద్‌కు టికెట్ కేటాయించిన బీజేపీ తమ బలాన్ని పెంచుకుంది. వనపర్తి జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి వంటి నేతలను చేర్చుకోవడంలో విజయవంతమైంది. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో ఆ పార్టీ ఎన్నికల ప్రచారానికి ఏకంగా దేశ ప్రధాని నరేంద్రమోదీ హాజరై శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. ఇటీవల బీజేపీ ముఖ్య నేతలతో టిఫిన్ బైటక్ కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రచారానికి శంఖారావం పూరించింది. పార్టీ అభ్యర్థి భరత్ ప్రసాద్ గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు.

ఆ ఊరంతా ఫీవర్..

ఒకే కుటుంబంలో నలుగురికి..



నర్సింగాపూర్ తండాలో ఒకే కుటుంబంలో నలుగురికి జ్వరాలు వచ్చాయి. మొదటగా వాలీ అనే వృద్ధురాలికి జ్వరం వచ్చింది. క్రమంగా ఆమె కోడలు లక్ష్మీ, ఆమె కుమార్తె జ్ఞానేశ్వరి, కుమారుడు లోకేష్‌కు సైతం జ్వరం రావడంతో కుటుంబం మొత్తం మంచాన పడింది.

- నర్సింగాపూర్‌లో ఇంటింటికీ ఇద్దరు చొప్పున జ్వర బాధితులు
- చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు కీళ్లనొప్పులతో నరకయాతన
- 20 రోజులుగా మంచానికే పరిమితమైన తండావాసులు
- వారం క్రితం రక్తనమూనాల సేకరణ.. మందుల అందజేత
- ఆ తర్వాత ఎస్‌ఎంఎస్ మెసేజ్‌లు పంపించి పట్టించుకోని వైద్య సిబ్బంది
- 'సాక్షి' విజిట్‌తో హడావుడిగా తండాకు పరుగులు



జ్వరం, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వృద్ధురాలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/భూత్పూర్: ఆ తండాకు జ్వరమొచ్చింది.. ఇంటింటికీ ఇద్దరు, ముగ్గురు.. ఇంటిల్లిపాది సైతం జ్వరపీడితులే. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు సుమారు 20 రోజులుగా ఫీవర్‌తో పాటు కీళ్లనొప్పులతో నరకయాతన అనుభవిస్తున్నారు. దాదాపుగా సగానికిపైగా కుటుంబాలవి రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు కాగా.. పెద్దలు మంచానికే పరిమితం కావడంతో ఆయా ఇళ్లల్లో గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. రక్త నమూనాల సేకరణకే మండల వైద్య సిబ్బంది పరిమితం కావడం.. ఆ తర్వాత వైద్య సేవల్లో నిర్లక్ష్యం మూలంగా తండావాసులు కోలుకోలేకపోతున్నారు.

కలుషిత నీటితోనేనా..

తండాలో మిషన్ భగీరథ ద్వారా తాగు నీరు సరఫరా చేస్తున్నారు. అయితే మిషన్ భగీరథ పైపులు అక్కడక్కడ లీకేజీ అవుతున్నాయి. వాటిని మరమ్మతులు చేయకపోవడంతో నీరు కలుషితమవుతోంది. ఈ నీటిని వంటతో పాటు తాగేందుకు ఉపయోగిస్తుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నట్లు తెలుస్తోంది.



నెల రోజులుగా విజృంభణ..

భూత్పూరు మున్సిపాలిటీ పరిధిలోని నర్సింగాపురం తండాలో దాదాపు 50 కుటుంబాలు నివసిస్తున్నాయి. తండా జనాభా సుమారు 800 ఉంటది. నెల రోజులుగా తండాలో కీళ్లనొప్పులతో కూడిన జ్వరాలు విజృంభించాయి. ఒక్కొక్కరిగా.. అన్ని ఇళ్లు జ్వరాల బారిన పడ్డాయి. తొలుత ఒకరిద్దరు జ్వరబాధితులు స్థానిక ఆర్‌ఎంపీలతోపాటు పలువురు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. ఆర్థిక భారం కావడంతో ఇంట్లోనే మందులతో సరిపెట్టుకుంటున్నారు. వార్డు కౌన్సిలర్ వసంత భర్త గోపాల్‌కు సైతం నెల రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ప్రస్తుతం ఆయన జ్వరం నుంచి కోలుకుంటున్నాడు.



తండాలో రోగులకు మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

ఓ అధికారి సమాచారంతో వెలుగులోకి..

వారం రోజుల క్రితం ఓ మండలస్థాయి ప్రభుత్వ అధికారి తండాను సందర్శించారు. ప్రతి ఇంట్లో జ్వర పీడితులు ఉన్నట్లు గ్రహించిన ఆయన వెంటనే భూత్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బందికి సమాచారం అందజేశారు. ఈ మేరకు వైద్యాధికారి డాక్టర్ అబ్దుల్ రబ్ వైద్యసిబ్బందితో కలిసి తండాను సందర్శించారు. ఇంటింటికీ తిరిగి జ్వర బాధితుల వివరాలు సేకరించారు. 25 మంది నుంచి రక్తనమూనాలు సేకరించారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఆ తర్వాత వైద్య సిబ్బంది తండాను సందర్శించిన దాఖలాలు లేవని జ్వరపీడితులు వాపోతున్నారు.

శాంపిళ్ల సేకరణకే పరిమితం..

జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించిన వైద్య సిబ్బంది.. ఆ రక్తపరీక్షల్లో ఏం తేలిందనేది జ్వరపీడితులకు చెప్పలేదు. శాంపిల్స్ తీసుకున్న తర్వాత వైద్య సిబ్బంది తమను పట్టించుకోలేదని.. ఏవో మందులు ఇచ్చి వెళ్లారని.. వాటిని వేసుకున్నా కీళ్లనొప్పులు తగ్గడం లేదని.. బాధ భరించలేకపోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వైద్య సిబ్బంది ఒకరిని 'సాక్షి' సంప్రదించగా.. రక్త పరీక్షల ఫలితాలపై తండాలో ఆధార్‌కార్డు లింక్ ఉన్న వారి ఫోన్ నంబర్లకు ఎస్‌ఎంఎస్ మెసేజ్ చేశామని.. వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నట్లు గుర్తించి మందులు అందజేశామని చెప్పడం గమనార్హం.

రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం నుంచి సుమారు 8 కి.మీ.ల దూరంలో భూత్పూర్ మున్సిపాలిటీ ఉంది. భూత్పూర్ సెంటర్ నుంచి మూడు కి.మీ.ల దూరంలో నర్సింగాపూర్ తండా ఉంది. హైవేలో ఉన్న శ్రీకృష్ణా హోటల్ ఎదురుగా కిలోమీటర్ దూరంలో తండా ఉండగా.. ఇటువైపు బస్సు సౌకర్యం లేదు. ప్రైవేట్ వాహనాలు సైతం అంతంత మాత్రంగానే వెళ్తుంటాయి. ఈ రవాణా కష్టాల నేపథ్యంలో అధిక మొత్తంలో జ్వరపీడితులు మంచానికే పరిమితమైనట్లు తెలుస్తోంది. ఒకవైపు భానుడి ప్రతాపం.. మరోవైపు వాహన సౌకర్యం లేక వైద్య సిబ్బంది తండా వైపు దృష్టిపెట్టలేదని తెలుస్తోంది.

'సాక్షి' విజిట్‌తో హడావుడిగా తండాకు..

నర్సింగాపూర్ తండాలో ప్రజలు జ్వరం, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న 'సాక్షి' శనివారం విజిట్ చేసింది. ఈ సమాచారం తెలుసుకున్న మండల ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు, సీహెచ్‌ఓ, హెల్త్ అసిస్టెంట్ హడావుడిగా తండాకు వచ్చారు. ఇంటింటికీ తిరిగి జ్వరపీడితుల ఆరోగ్య పరిస్థితి వివరాలు సేకరించి మందులు అందజేశారు.

రక్తం తీసుకున్నారు.. కానీ ఏం చెప్పలేదు..



మా ఇంట్లో నాతో పాటు మా అత్త, ఇద్దరు పిల్లలం 15 రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాం. మూడు రోజుల క్రితం ప్రభుత్వ వైద్య సిబ్బంది తండాకు వచ్చి రక్తం శాంపిళ్లు తీసుకెళ్లారు. మందులు ఇచ్చారు. కానీ.. అది ఏ జ్వరమో చెప్పలేదు. కీళ్లనొప్పులు భరించలేకపోతున్నాం.

– లక్ష్మి, నర్సింగాపూర్ తండా

రెండు రోజుల నుంచి జ్వరం..



నాకు జ్వరం వచ్చి రెండు రోజులైంది. మా నాన్న ఊరికి పోయిండు. మా ఇంటికే ఏ డాక్టర్ రాలేదు. మా నాన్న వచ్చిన తర్వాత దవాఖానాకు వెళ్తా.

– భానుమతి, నర్సింగాపూర్ తండా

జ్వరం, నొప్పులతో నడవలేకపోతున్నా..



నాకు జ్వరంతో పాటు మోకాళ్ల నొప్పులు వచ్చాయి. పది రోజులైనా తగ్గడం లేదు. నాలుగైదు రోజుల కింద డాక్టర్లు, సిస్టర్లు వచ్చి మందు ఇచ్చారు. అయినా జ్వరం, నొప్పులు అట్లనే ఉన్నాయి. నడవలేకపోతున్నా.

– వాలి, నర్సింగాపూర్ తండా

సీజనల్‌గా వచ్చే వ్యాధులే..



వాతావరణ మార్పులతో నర్సింగాపూర్ తండాలో సీజనల్ వ్యాధులు వచ్చాయి. సమాచారం అందుకోగానే తండాలో మెడికల్ క్యాంపు నిర్వహించాం. 25 మందికి రక్త పరీక్షలు చేశాం. 15 మందికి జ్వరంతో పాటు వైరల్ ఫీవర్ అని రిపోర్ట్ వచ్చింది. జ్వరం, కీళ్ల నొప్పులు ఉన్నవారికి మందులు ఇచ్చాం. ప్రతి రోజు మా వైద్య సిబ్బంది వెళ్లి రోగాలపై ఆరా తీసి మందులు ఇస్తున్నారు.

– డాక్టర్ అబ్దుల్ రబ్, మండల వైద్యాధికారి, భూత్పూర్

న్యూస్‌రీల్

ప్రజల చెంతకే పోలీసు సిబ్బంది

గద్వాల క్రైం: జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల వారీగా ఇక నుంచి వారంలో రెండు రోజులు పోలీసు సిబ్బంది ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకుంటారని ఎస్పీ రితిరాజ్ శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న విపత్కర సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజయడం, చట్టాలపై అవగాహన కల్పించేందుకు పోలీసు శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు. సైబర్ నేరాలు, మహిళా వేధింపులు, చోరీలు, పోక్సో కేసులు, మత్తు పదార్థాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రజల వద్దకు పోలీసు సిబ్బంది వచ్చినప్పుడు ధైర్యంగా సమస్యలను తెలియజేయాలని సూచించారు.

బీజేపీకి గుణపాఠం చెప్పాలి



గద్వాల అర్బన్: ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న బీజేపీకి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజా సమస్యలను చర్చించే చట్టసభలను సైతం అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా నిరుద్యోగులను రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తంచేశారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరణ చేస్తూ, కోట్లాది మంది రైతులు, కార్మికుల సంపాదనను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. మతోన్మాద బీజేపీని ఓడిస్తేనే దేశంలో లౌకిక పాలనకు బాటలు పడతాయన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎంవీ రమణ, జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, రేపల్లె దేవదాస్, పరంజ్యోతి, వీవీ నర్సింహ, ఉప్పేరు నర్సింహ ఉన్నారు.

3న పీయూ నాన్‌టీచింగ్ సిబ్బంది పరీక్ష

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ నాన్‌టీచింగ్ సిబ్బందికి వచ్చే నెల 3, 4 తేదీల్లో స్కిల్ టెస్టు నిర్వహిస్తున్నట్లు పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి శనివారం సర్క్యులర్ జారీ చేశారు. ఇందులో గతంలో దరఖాస్తులు చేసుకున్న సిబ్బంది పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

ఓటింగ్ యంత్రాలకు పటిష్ట భద్రత

- కలెక్టర్ బీఎం సంతోష్



ఓటింగ్ యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాలరూరల్: ఎన్నికల్లో వినియోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు పటిష్ట భద్రత కల్పిస్తున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఈవీఎం గోదామును పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి ర్యాండమైజేషన్ పూర్తయిన అలంపూర్, గద్వాల నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు ఈవీఎంలు, వీవీ ప్యాట్స్ అందజేసినట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో వినియోగించే యంత్రాలను స్ట్రాంగ్‌రూంలో భద్రపర్చాలని సూచించారు. గద్వాల సెగ్మెంట్ పరిధిలో 378 బ్యాలెట్ యూనిట్లు, 378 కంట్రోల్ యూనిట్లు, 624 వీవీ ప్యాట్స్ కేటాయించినట్లు తెలిపారు. అలంపూర్ సెగ్మెంట్ పరిధిలో 363 బ్యాలెట్ యూనిట్లు, 363 కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్స్ కేటాయించినట్లు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్, వెంకటేశ్వర్లు, ఆర్డీఓ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

మూడోరోజు రెండు నామినేషన్లు



కలెక్టర్ రవినాయక్‌కు నామినేషన్ పత్రం అందజేస్తున్న డీఎస్పీ అభ్యర్థి రాకేశ్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి నామినేషన్ల ప్రక్రియలో భాగంగా శనివారం మూడోరోజు మరో రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఏఐఎంఐఎం అభ్యర్థిగా షేక్ మున్నాభాష, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా జి.రాకేశ్ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవి నాయక్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఇదిలా ఉండగా మరో పార్లమెంట్ నియోజకవర్గమైన నాగర్‌కర్నూల్‌లో ఈ రోజు ఎవరూ నామినేషన్లు దాఖలు చేయలేదని అధికారులు తెలిపారు.

నిబంధనలకు పాతర

- మాన్‌దొడ్డి వైన్‌షాపులో బాలలకు మద్యం విక్రయం
- చర్యలు తీసుకుంటామన్న ఎక్సైజ్ సీఐ



మాన్‌దొడ్డి వైన్‌షాపులో మద్యం తీసుకుంటున్న మైనర్లు

రాజోళి: 18 ఏళ్ల వయసులోపు పిల్లలకు మద్యం అమ్మకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ.. అవన్నీ తమకేమి పట్టవన్నట్టుగా వైన్‌షాపుల నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు. కొందరు ఇష్టానుసారం మద్యం విక్రయాలు సాగిస్తూ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. రాజోళి మండలంలోని మాన్‌దొడ్డిలో లైసెన్స్ వైన్‌షాపు ఉండగా.. ఎక్కువగా బెల్టు షాపుల్లో మద్యం అమ్మేందుకు ప్రోత్సహిస్తుంటారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై పత్రికల్లో కథనాలు కూడా వచ్చాయి. అయినప్పటికీ అధికారుల్లో చలనం లేకుండాపోయింది. తాజాగా 18 ఏళ్ల వయసులోపు బాలలకు మద్యం విక్రయించిన వైన్స్‌షాపు సిబ్బంది.. ఈ వ్యవహారాన్ని మసిబూసి మారేడు కాయ చేసేందుకు యత్నించారు. అయితే 'సాక్షి' పరిశోధనలో పలు వాస్తవాలు బయటపడ్డాయి. మాన్‌దొడ్డిలో వైన్‌షాపు ప్రారంభించినప్పటి నుంచి ఇదే తంతు కొనసాగుతుందని గ్రామస్తులు అంటున్నారు. చిన్నా పెద్ద తేడా లేకుండా మద్యం అమ్మడంతో పాటు ఏపీకి సరిహద్దులోని గ్రామాలకు మైనర్లతో మద్యం సరఫరా చేయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మైనర్లకు యథేచ్ఛగా మద్యం విక్రయిస్తున్నా ఎక్సైజ్ పోలీసులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని పేర్కొంటున్నారు. శనివారం దుకాణానికి వచ్చిన వారిలో పదో తరగతి పరీక్షలు రాసిన బాలుడితో పాటు మరో ఎనిమిదేళ్ల బాలుడు ఉన్నాడు. వారు బైక్‌పై వచ్చి తమ బావ చెప్పాడని.. మద్యం తీసుకెళ్లడం గ్రామస్తులందరూ చూశారు. కానీ వైన్‌షాపులో ఉన్న వ్యక్తి దాన్ని బుకాయించే ప్రయత్నం చేశాడు. తీరా సదరు బాలుడు తనకు మద్యం ఇచ్చింది ఈయనే అని చెప్పేసరికి చేసేదేమీ లేక ముఖం చాటేశాడు. గతంలో సరైన ఆధారాలు లేవని సాకు చెప్పిన అధికారులు.. ప్రస్తుతం రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన తర్వాత ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూస్తామని గ్రామస్తులు అంటున్నారు. కాగా, మైనర్లకు మద్యం విక్రయంపై ఎక్సైజ్ సీఐ డి.హనుమానాయక్‌ను వివరణ కోరగా.. మద్యం దుకాణానికి ఉన్న లైసెన్స్ ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంబంధిత చట్టంలో ఏముందో అదే చేస్తామని, దాన్ని ప్రకారం చర్యలు ఉంటాయన్నారు.

మెజార్టీ కోసమే ప్రయత్నం

- మంత్రి జూపల్లి కృష్ణారావు



బిజినేపల్లి: కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డా.మల్లురవి గెలుపు లాంఛనమే అయినా అత్యధిక మెజార్టీని సాధించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని బహుమతిగా ఇచ్చిన సోనియా గాంధీకి, తిరిగి చేతి గుర్తుకి ఓటు వేసి రాహుల్ గాంధీని ప్రధాని చేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. 23న నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం కోసం లక్షన్నర మందితో బహిరంగ సభను బిజినేపల్లిలో ఏర్పాటు చేయనున్నారని, కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. అదే రోజు డా.మల్లురవి నామినేషన్ ప్రక్రియ కూడా ఉంటుందన్నారు. ఎంపీ అభ్యర్థి డా.మల్లురవి మాట్లాడుతూ బిజినేపల్లిలో సభ నిర్వహణ తమకు ఒక సెంటిమెంట్‌గా భావిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని బలపర్చేందుకు అసెంబ్లీ ఎన్నికల్లో ఆదరించిన దానికంటే ఎక్కువగా ఇప్పుడు ఆదరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీల్లో ఇప్పటికే 5 గ్యారంటీలు అమలు చేస్తున్నామని, ప్రజలు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి రాహుల్‌గాంధీని ప్రధానిని చేస్తే కేంద్రం నుంచి మరో 5 పథకాలు ప్రజలకు అందుతాయన్నారు. జెడ్పీచైర్మన్ సరితారెడ్డి, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, డా.వంశీకృష్ణ, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

హెలీప్యాడ్ పరిశీలన

23న సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించబోయే సభా స్థలాన్ని డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కనకయ్యగౌడ్, ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి ప్రత్యేకంగా పరిశీలించారు. సీఎం హెలీప్యాడ్ దిగడం కోసం ఏర్పాటు చేసిన స్థలాన్ని పరిశీలించారు. సభ ప్రాంగణం, సభకు వచ్చే వాహనాల పార్కింగ్‌ను పరిశీలించారు.

క్లుప్తంగా

రైలులో నుంచి కిందపడిన వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: రైలులో నుంచి దిగుతూ.. కిందపడి గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. రైల్వే ఎస్ఐ సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో ఆగుతున్న రైలులో నుంచి దిగడానికి వెళ్లి గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి(55) హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభించలేదని, మృతుడి కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

రైస్‌మిల్లు యజమానికి రిమాండ్

పాన్‌గల్: సీఎంఆర్ ధాన్యం మాయం చేసిన ఘటనలో మాందాపూర్ గ్రామ రైస్ మిల్లు యజమాని పుచ్చల పరమేశ్వర్‌రెడ్డిని వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్ రావు ఆదేశానుసారం శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వేణు తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. మాందాపూర్ పరమేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులపై నాలుగు రైస్ మిల్లులున్నాయి. అందులో మాందాపూర్‌లో అతని కోడలు అనూషరెడ్డి పేరు మీద ఉన్న ఇషాన్ అగ్రో టెక్ రైస్ మిల్లు కొనసాగుతోంది. పరమేశ్వర్‌రెడ్డి అతని కుమారుడు పుచ్చల మధుకుమార్‌రెడ్డి పౌరసరఫరాల కార్పొరేషన్ వారితో సీఎంఆర్ బియ్యం అందించేందుకు ఒప్పందం చేసుకున్నారు. పౌరసరఫరాల శాఖను, ప్రభుత్వాన్ని మోసం చేసి వారు బహిరంగ మార్కెట్‌లో ధాన్యం రూ.3.25 కోట్లకు అమ్ముకొని లాభం పొందారు. ఈ విషయంలో పౌరసరఫరాల శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు పుచ్చల పరమేశ్వర్‌రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పుచ్చల మధుకుమార్ రెడ్డి, కోడలు అనూషరెడ్డిలు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సీఎంఆర్ బస్తాల్లో రూ.కోట్లల్లో తేడా



కల్వకుర్తి: కల్వకుర్తి పట్టణంలోని పారాబాయిల్డ్ మిల్లులో సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యపు బస్తాల్లో భారీ తేడాలు ఉన్నట్లుగా సివిల్ సప్లయ్ అధికారులు గుర్తించారు. శనివారం పట్టణంలోని లక్ష్మీ వెంకట నర్సింహా స్వామి పారాబాయిల్డ్ ఇండస్ట్రీస్‌లో సివిల్ సప్లయ్ టాస్క్‌ఫోర్స్ బృందం ఓఎస్డీ ప్రభాకర్ రెడ్డి టీం ఆకస్మిక దాడులు నిర్వహించారు. దాడుల్లో సీఏఆంర్ ధాన్యపు బస్తాల లెక్కలు పరిశీలించారు. మిల్లుకు ఇచ్చిన సీఏఆంర్ ధాన్యపు బస్తాల్లో 2,89,694 బస్తాలు తక్కువగా ఉండగా.. వాటి విలువ రూ.23.3 కోట్లుగా ఉందని అధికారులు తెలిపారు. మిల్లులో ధాన్యపు బస్తాలు తక్కువగా ఉన్నాయనే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని, వారి ఆదేశానుసారం తగు చర్యలు ఉంటాయని తెలియజేశారు. దాడుల్లో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి స్వామి కుమార్, డీసీఎస్ఓ, డీఎం బాలరాజు, మేనేజర్ క్వాలిటీ కంట్రోల్, డీటీ రవికుమార్, నర్సింగ్‌రాజులు తదితరులు పాల్గొన్నారు.

భారీగా నగదు, మద్యం పట్టివేత

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో భారీ స్థాయిలో నగదు, మద్యం పట్టుబడింది.

- సాక్షి, నెట్‌వర్క్

⇨ వనపర్తి జిల్లా వ్యాప్తంగా శనివారం ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో రూ.15.40 లక్షల నగదును పోలీసులు సీజ్ చేశారు. వనపర్తి టౌన్ పీఎస్ పరిధిలో రూ.4,27,500, వనపర్తి రూరల్ పీఎస్ పరిధిలో రూ.1.50లక్షలు, గోపాల్‌పేట్ పీఎస్ పీఎస్ పరిధిలో రూ.3.90లక్షలు, పెబ్బేరు పీఎస్ పరిధిలోరూ.లక్ష, పెద్దమందడి పీఎస్ పరిధిలో రూ.53వేలు, ఆత్మకూరు పీఎస్ పరిధిలో రూ.1.11లక్షలు, మదనాపురం పీఎస్ పరిధిలో రూ.60వేలు, శ్రీరంగాపూర్ పీఎస్ పరిధిలో రూ.1.49లక్షలు, అమరచింత పీఎస్ పరిధిలో రూ.లక్ష నగదును సీజ్ చేశారు. ఒక్క శనివారం జిల్లాలో మొత్తం రూ.15,40,500 నగదు సీజ్ చేసినట్లు ఎస్పీ రక్షితా కె.మూర్తి వెల్లడించారు.

⇨ రాజోళి మండలంలోని మాన్‌దొడ్డి శివారులో అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. తనగలకు చెందిన వ్యక్తి నుంచి క్వార్టర్ సీసాలు, బీరు బాటిళ్లు పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. సుంకేసుల డ్యాంపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మరో వ్యక్తి వద్ద రూ.2 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

⇨ ఎర్రవల్లి మండలంలోని కొండేరు శివారులో ఆటోలో తరలిస్తున్న మద్యంను పోలీసులు పట్టుకున్నారు. కర్నూల్‌కు చెందిన ఆటోను, డ్రైవర్ షేక్ ఫయాజ్ బాషాను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

⇨ కేటీదొడ్డి మండలంలోని నందిన్నె చెక్‌పోస్టు వద్ద రాయచూర్ నుంచి గద్వాల వైపు వస్తున్న వ్యక్తి నుంచి రూ.52వేల నగదు పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌రావు శనివారం తెలిపారు.

⇨ నారాయణపేటలో టాస్క్ ఫోర్స్ పోలీసులు నిర్వహించిన దాడులలో 25.32 లీటర్ల లిక్కర్ పట్టుకుని సీజ్ చేశారు. పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్న జెట్రం చెందిన కంచే వెంకటేష్ నారాయణపేట నుంచి 9.72 లీటర్ల మద్యం అక్రమంగా తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నారాయణపేట టౌన్ సుభాష్ రోడ్ కాలనీకి చెందిన సురేష్ గౌడ్ వద్ద 15.6 లీటర్ల మద్యం, వాహనాల తనిఖీల్లో జలాల్‌పూర్ చెక్‌పోస్టు దగ్గర నగదు పట్టుకున్నారు. కర్ణాటక నుంచి నారాయణపేట వస్తున్న ఇద్దరు వ్యక్తులు జగలింగం, కర్నే గ్రామం గుర్మిట్కల్ వద్ద రూ.57వేలు, కాశీంఅప్ప నుంచి రూ.50వేలు పట్టుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.



నందిన్నె చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన నగదుతో పోలీస్ సిబ్బంది



మక్తల్ మండలం భూత్పూర్‌లో పట్టుబడిన మద్యం

⇨ మక్తల్ మండలం భూత్పూర్ గ్రామంలో చెన్నయ్యగౌడ్ ఇంట్లో రూ.76,160 విలువ గల 43.75 లీటర్ల మద్యం పట్టుకున్నట్లు ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు.

⇨ అలంపూర్ జాతీయ రహదారిపై చౌరస్తా నుంచి కర్నూల్‌కు వెళ్తున్న పార్వతిబాయి నుంచి 10.80 లీటర్ల మద్యం పట్టుబడగా ఉండవెల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్ర సరిహద్దులోని పుల్లూరు చెక్ పోస్టు వద్ద కర్నూల్ నుంచి బస్సులో హైదరాబాద్‌కు ప్రయాణిస్తున్న ఇలియాజ్ వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేని రూ.62,900 నగదును తీసుకెళ్తుండగా పట్టుకుని ఎస్ఐ తెలిపారు. అదేవిధంగా ప్రొద్దుటూరు నుంచి ముంబాయికి కారులో వెళ్తున్న శివాజీ వద్ద రూ.95,500 నగదు పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.



పుల్లూరు చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన నగదును పరిశీలిస్తున్న పోలీసులు



ఇటిక్యాల పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం

త్వరలోనే ఉమ్మడి జిల్లాలో కేసీఆర్ పర్యటన

● మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: త్వరలోనే ఉమ్మడి పాలమూరు జిల్లాలో బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ పర్యటించనున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. శనివారం మహబూబ్‌నగర్ పట్టణం న్యూటౌన్‌లోని పార్టీ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక రైతులు, ప్రజలతో మాట్లాడటంతో పాటు రోడ్ షోలలో మాజీ ముఖ్యమంత్రి పాల్గొంటారన్నారు. ప్రజలలో కాంగ్రెస్ విశ్వాసం కోల్పోయిందని, అమలుకు సాధ్యంకాని హామీలు ఇవ్వడంతో పాటు తప్పుడు ప్రచారంతో గత శాసనసభ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులు గెలిచారని ఆరోపించారు. పింఛన్ ఇవ్వలేదని మహిళలు, రైతుబంధు, రుణమాఫీ చేయలేదని రైతులు, ఉద్యోగాలు ఇవ్వలేదని యువత ఇలా అన్ని వర్గాలు రాష్ట్ర ప్రభుత్వంపై కోపంతో ఉన్నారని పేర్కొన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టం కట్టేందుకు వారు సిద్ధంగా ఉన్నారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ వంద రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామన్న కాంగ్రెస్ నేతలు మాట తప్పారని విమర్శించారు. ఆ పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధిస్తారన్నారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ఎక్కడా చెప్పలేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెబుతున్నారని, సీఎం రేవంత్‌రెడ్డేమో ఆగస్టు 15లోగా చేస్తామని.. ఇలా ఒకరికొకరు అవగాహన లేకుండా మాట్లాడుతూ ప్రజలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. వారు చేస్తున్న తప్పుడు ప్రచారం.. మోసపూరిత హామీలపై ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామన్నారు. సమావేశంలో డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ కేసీ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రహమాన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

గిరిజనులను విస్మరించిన కాంగ్రెస్

స్టేషన్ మహబూబ్‌నగర్: గిరిజనులను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని సేవాలాల్ సేన జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం బంజారాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తున్నా గిరిజనులకు మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజన సంఘాలు, సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ్ నాయక్ ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్‌లో ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉంటున్నట్లు తెలిపారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌నాయక్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనులను పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు కాంగ్రెస్‌కు కూడా గిరిజనుల సమస్యల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. రాష్ట్ర నాయకురాలు విజయ, నాయకులు రాజునాయక్, రాజేష్‌నాయక్, రాందాస్ నాయక్, మోహన్‌నాయక్, బంజారా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్ నాయక్

■ బీటలు వారిన కృష్ణమ్మ..



జీవనది.. కృష్ణానది నేడు నీరు లేక నెర్రెలిచ్చింది. జూరాల ప్రాజెక్టులో నీటిమట్టం రోజురోజుకు తగ్గుతుండటమే ఇందుకు కారణం. ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌కు సమీపంలోని పాత కిష్టంపల్లి శివారులో కృష్ణానది శనివారం ఇలా కనిపించింది.

- అమరచింత

భూ అక్రమాలను ఉపేక్షించబోం



నాలా ఆక్రమణపై బాధిత రైతులతో కలిసి ఆధారాలు చూపిస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: 'భూ ఆక్రమణలు పెరిగిపోయాయి.. గత బీఆర్ఎస్ పాలనలో ఎక్కడికక్కడ ప్రభుత్వ భూములతో పాటు శిఖం, అసైన్డ్ భూములను ఆక్రమించుకున్నారు. ఇందుకు సంబంధించి రెవెన్యూ అధికారులతో పాటు నీటి పారుదల, మైన్స్, ముడా అధికారులు అమ్యామ్యాలకు ఆశపడి అనుమతులు జారీ చేశారు. రికార్డులను మసిపూసి మారేడు కాయ చేసి మాయం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వీటిని ప్రశ్నించడం తప్పెలా అవుతుందని' జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. తాము కూడా గత పాలనలో మాదిరిగా అవినీతి, అక్రమాలకు పాల్పడి మిన్నంకుండాలా అంటూ నిలదీశారు. శనివారం బాలానగర్ శివారులోని చెరువుకట్టపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అవినీతి, అక్రమాలు, అధికారుల తీరుపై ఎమ్మెల్యే మండిపడ్డారు. బాలానగర్ చెరువు కింద ఆయకట్టుతో పాటు అసైన్డ్ భూములను సైతం దొడ్డిదారిన చేజిక్కించుకున్న ఆక్రమార్కులు వెంచర్ ఏర్పాటు చేశారని, ఇందుకోసం దశాబ్దాల నాటి చెరువుకు సంబంధించి అలుగు పారే నాలాను సైతం ఆక్రమించి చదును చేశారని ఆరోపించారు. నాలాను పూడ్చి వేయడంతో చెరువు నుంచి పారే నీళ్లు సమీప వ్యవసాయ భూముల గుండాపోయి పంటలు పండే పొలాలు కోతకు గురయ్యే ప్రమాదం వాటిల్లిందని రైతులు గగ్గోలు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 12 అడుగుల మేర మట్టిని తోలి.. నీళ్లు పారే నాలా ఆనవాళ్లు లేకుండా చేశారన్నారు. ఇందుకు అధికారికంగా జారీ చేసిన మ్యాప్‌లతో పాటు గూగుల్ మ్యాప్ తదితర నివేదికలను ఆయన చూపించారు.

వంత పాడుతున్న అధికారులు

బాలానగర్ చెరువు నాలా, అసైన్డ్ భూముల ఆక్రమణపై న్యాయబద్ధంగా వ్యవహరించాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్, మైన్స్, ముడా అధికారులు అక్రమార్కులకు వంత పాడుతున్నారని ఎమ్మెల్యే దుయ్యబట్టారు. స్వయంగా క్షేత్రస్థాయిలో విచారించి దాదాపు రూ.5.12 కోట్లు జరిమానా విధించిన మైన్స్ ఏడీ తదుపరి అక్రమార్కులకు వంత పాడుతూ వెంచర్‌లోనే మట్టి తొవ్వి అక్కడే నింపారని నింపాదిగా ఓ నివేదిక జారీ చేసి బదిలీ అయ్యారని విమర్శించారు. నిబంధనల మేరకు రోడ్లు తదితర వాటిని పరిశీలించకుండానే ముడా కమిషనర్ అనుమతి ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఇక 1956లోనే అసైన్డ్ భూముల పట్టా మార్పిడి చేసినట్లు రికార్డులు తారుమారు చేశారని, రికార్డుల దిద్దుబాటుపై ఫోరెన్సిక్ అనుమతి కోరాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

❐ ప్రభుత్వ భూమిలో నిర్మించిన వైకుంఠధామం కూల్చివేసి వెంచర్‌లో కలిపేసుకున్నా అధికారులు ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఒకవేళ ప్రైవేట్ పట్టా భూమి అయితే అందులో వైకుంఠధామం ఎలా నిర్మించారని, ఇందుకు అప్పటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఎలా శంకుస్థాపన చేశారని ప్రశ్నించారు. 18 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన ఈ వెంచర్‌కు ఎలాంటి అనుమతులు లేకుండానే పనులు చేపట్టడం ఏమిటని అన్నారు.

రెవెన్యూ మంత్రికి ఫిర్యాదు

రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేసి సమగ్రంగా విచారణకు ఆహ్వానిస్తామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా సీఎస్ శాంతికుమారితో పాటు మైన్స్, ఇరిగేషన్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని, హైకోర్టును సైతం ఆశ్రయించి న్యాయం కోసం పోరాడుతామని స్పష్టం చేశారు.

పోలేపల్లి భూములపై విచారించాలి

జడ్చర్ల మండలం పోలేపల్లిలో మిగులు భూముల ఆక్రమణ జరిగిందని, చుట్టూ ఉన్న సర్వే నంబర్లకు బై నంబర్లు వేసి అధికారులు రిజిస్ట్రేషన్లు చేశారని ఆరోపించారు. ఈ భూములను ఆక్రమించుకున్న వారు ఇటీవల రాతి కడీలు పాతగా తామే కూల్చివేయించామన్నారు. ఇకపై ప్రభుత్వ భూములు, చెరువులు ఎక్కడ ఆక్రమించుకున్నా అక్కడికి వెళ్లి విచారిస్తామన్నారు.

నా నంబర్ బ్లాక్ చేశారు

తన ఫోన్ నంబర్‌ను మైన్స్ ఏడీ బ్లాక్ చేశారని ఎమ్మెల్యే ఆరోపించారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యేగా ప్రజాసమస్యలపై తాను మాట్లాడేందుకు ప్రయత్నించగా జిల్లా నుంచి బదిలీపై జనగామ జిల్లాకు వెళ్లిన మైన్స్ ఏడీ తన ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేశారన్నారు. అలాగే పోలేపల్లి భూముల ఆక్రమణపై మాట్లాడేందుకు జడ్చర్ల తహసీల్దార్‌కు ఫోన్ చేయగా 3 గంటల పాటు స్విచ్ ఆఫ్ రావడంతో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాల్సి వచ్చిందన్నారు.

బీఆర్ఎస్‌కు ఉలుకెందుకు?

వెంచర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అక్రమాలపై తాను ఫిర్యాదు చేస్తే బీఆర్ఎస్ నాయకులకు ఉలుకెందుకు అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. తాను మీడియా దృష్టికి అక్రమాలు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తే బీఆర్ఎస్ నాయకులు తనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం శోచనీయమన్నారు. వెంచర్ అక్రమాలను వెలుగులోకి తెస్తుండడంతో ఓ బీఆర్ఎస్ యువ నాయకుడు ఆందోళన చెందుతున్నాడని దుయ్యబట్టారు. అక్రమార్కులను ప్రోత్సహించిన అధికారులపై చర్యలతో పాటు వెంచర్ అక్రమాలపై విచారించి చర్యలు తీసుకోకపోతే జూన్ 4న సత్యాగ్రహ దీక్ష చేపడతానని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చెప్పారు.

రూ.77వేల నగదు చోరీ

● గోల్డ్‌లోన్ కట్టడానికి వచ్చిన వ్యక్తికి మాయమాటలు చెప్పి కాజేసిన వైనం

అడ్డాకుల: బ్యాంకు వద్ద గోల్డ్ లోన్ కట్టడానికి వచ్చిన వ్యక్తి వద్ద మాయ మాటలు చెప్పిన ఓ దొంగ నగదు ఎత్తుకెళ్లిన ఘటన అడ్డాకుల మండలం కందూర్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన కృష్ణయ్యకు కందూర్ ఎస్‌బీఓలో గోల్డ్ లోన్ ఉంది. దాన్ని క్లియర్ చేయడానికి రూ.80వేల నగదును తీసుకుని శనివారం బ్యాంకు వద్దకు వచ్చాడు. లోన్‌కు సంబంధించిన వడ్డీ వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తుండగా అక్కడే ఉన్న ఓ యువకుడు కృష్ణయ్యతో మాటలు కలిపాడు. దేవాలయం వద్ద బ్యాంకుకు సంబంధించిన ఓ సారు ఉన్నాడని, అక్కడికి వస్తే వడ్డీ తక్కువ చేయిస్తాడని నమ్మబలికాడు. కృష్ణయ్యను తన బైక్‌పై ఎక్కించుకుని ఆలయం వద్దకు తీసుకెళ్లాడు. అక్కడే ఉన్న ఓ కారులో సారు ఉన్నాడని, ఆయనకు రూ.3వేలు ఇచ్చి రావాలని చెప్పగా తన వద్ద ఉన్న రూ.77వేలను యువకుడి వద్ద ఉంచి రూ.3వేలను తీసుకుని కారు వద్దకు వెళ్లాడు కృష్ణయ్య. అందులో ఎవరు లేకపోవడంతో వెనక్కి చూశాడు. తీరా తనను తీసుకొచ్చిన యువకుడు అక్కడ కనిపించకపోవడంతో మోసపోయానని తెలుసుకున్నాడు. బ్యాంకు వద్దకు వెళ్లి అధికారులను కలవగా సీసీ ఫుటేజీ పరిశీలించారు. అయితే యువకుడు వచ్చిన బైక్‌కు నంబర్ ప్లేట్ లేకపోవడంతో పాటు తలకు హెల్మెట్ ధరించడంతో వివరాలు తెలియరాలేదు. అయితే నగదు ఎత్తుకెళ్లిన దొంగ కృష్ణయ్యకు తనదే అంటూ ఒక సెల్‌ఫోన్‌ను ఇచ్చి వెళ్లినట్లు తెలిసింది. కాగా ఆ ఫోన్ కూడా ఎవరితోనో దొంగిలించి తెచ్చినట్లు సమాచారం. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయం



గర్భగుడిలో పబ్బతిహనుమాన్ అలంకరణ

● నేటి నుంచి మద్దిమడుగు పబ్బతి హనుమాన్ ఆలయంలో మాల విరమణ ఉత్సవాలు
● 23న హనుమాన్ గాయత్రి మహాయజ్ఞం

అమ్రాబాద్: తెలంగాణలో ప్రసిద్ధి చెందిన ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో మద్దిమడుగు ఒకటి. ఇక్కడ వెలిసిన పబ్బతి ఆంజనేయస్వామి పిలిస్తే పలికే దైవంగా, కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా భక్తుల పూజలందుకుంటున్నాడు. నల్లమల కొండలపై ప్రవహించే కృష్ణానది, పశ్చిమ భాగమున దుందుబి నది సంఘమించి రెండు నదుల కలయిక మధ్యన 12 కిలోమీటర్ల దూరంలో ప్రకృతి రమణీయ ప్రదేశంలో వెలిసిన మద్దిమడుగు పబ్బతి ఆంజనేయ స్వామి దీక్షామాల విరమణ బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి అత్యంత వైభవంగా కొనసాగనున్నాయి.

ఘనంగా మాలధారణ

మద్దిమడుగు ఆంజనేయ స్వామి ఉత్సవాలు ప్రతి సంవత్సరం రెండు పర్యాయాలు కొనసాగుతాయి. కార్తీక మాసంలో దీక్షమాల విరమణ, చైత్రమాసంలో జయంతి ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భక్తులు ఆంజనేయ స్వామి మాలను ధరిస్తారు. 40 రోజుల కఠోర దీక్ష అనంతరం ఇరుముడులతో ఆలయం వద్దకు వచ్చి ముడుపులు స్వామివారికి సమర్పించి దీక్ష విరమణ పొందుతారు.

ఉత్సవాల ప్రత్యేక కార్యక్రమాలు

21న ఉదయం యాగశాలప్రవేశం, విఘ్నేశ్వరపూజ పుణ్యాహవచనం, రాత్రి పార్వతి పరమేశ్వరుల కల్యాణం, 22న ద్వాదశ వాస్తుపూజ, గరుడవాహన సేవ, రాత్రికి సీతారాముల కల్యాణం, 23న స్వామి వారికి మహాకుంబాభిషేకం, హనుమాన్ గాయత్రి హోమం, పూర్ణాహుతి, దీక్షమాల విరమణలు నిర్వహిస్తారు.

ఏర్పాట్లు పూర్తి

మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మాల విరమణ భక్తులకు ప్రత్యేక షెడ్లు, భక్తులకు నీటి సమస్య లేకుండా(సింటటిక్) మినీ ట్యాంకులు, పదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా మాచర్ల, దేవరకొండ, మిర్యాలగూడ, అచ్చంపేట, నల్గొండ, నాగర్‌కర్నూల్ డిపోల నుంచి ఆర్టీసీ బస్సులను నడుపుతారు.

పాలిటెక్నిక్ లెక్చరర్ల ఫలితాల్లో అయ్యవారిపల్లి వాసి స్టేట్‌ఫస్ట్



నవీన్‌కుమార్

మిడ్జిల్: పాలిటెక్నిక్ లెక్చరర్ల ఫలితాలు శుక్రవారం విడుదల కాగా మిడ్జిల్ మండలంలోని అయ్యవారిపల్లికి చెందిన కర్నేకోట నవీన్ కుమార్ రాష్ట్రంలో మొదటి ర్యాంక్ సాధించారు. మొత్తం 450 మార్కులకు గాను 365 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. పేద రైతు కుటుంబానికి చెందిన కర్నేకోట నాగేశ్వర్, ఈశ్వర్‌బాయిల రెండో కుమారుడు నవీన్ మొదటి సారి పరీక్షకు హాజరై రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించడంపై గ్రామస్తులు, మండల ప్రజలు అభినందనలు తెలిపారు. .

గ్యాస్ లీకై మంటలు

● పూర్తిగా కాలిన గుడిసె



గట్టు: మండల పరిధిలోని బోయలగూడెం గ్రామంలో శనివారం మధ్యాహ్నం ఓ గుడిసెలో గ్యాస్‌లీకై అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన ఉప్పరి చిన్నరాముడు గుడిసెలో తల్లి అనంతమ్మ నివాసం ఉంటుంది. మధ్యాహ్నం వంట ముగించుకున్న తర్వాత గుడిసె బయటకు రాగా.. ఈ సమయంలో గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కల వారు గమనించి మంటలను ఆర్పివేసేందుకు ప్రయత్నించారు. కానీ అప్పటికే గుడిసె పూర్తి కాలింది. కాగా మంటలు పక్కనే ఉన్న మరో గుడిసెలకు మంటలు వ్యాపించకుండా గ్రామస్తులు చర్యలు తీసుకున్నారు. అయితే.. గుడిసెలో కూడబెట్టుకున్న రూ. 90 వేలు కాలిపోయాయని.. మొత్తంగా సుమారుగా రూ. 2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.

రామన్‌పాడులో 1,010 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శనివారం 1,010 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు. జూరాల ఎడమ, సమాంతర కాల్వ నుంచి నీటి సరఫరా లేదని, తాగునీటి అవసరాలకు రిజర్వాయర్‌లోని 20 క్యూసెక్కుల నీటిని ప్రతిరోజు వినియోగిస్తున్నామని పేర్కొన్నారు.